# గురు దర్శనం



## INTIMATE TALKS



## WITH INITIATES



శ్రీ శార్వరి

# గురు దర్శనం

***[Intimate talks with Initiates]***

శ్రీ శార్వరి

ప్రచురణ

**మాస్టర్ యోగాశ్రమం**

**GURU DARSANAM**
***Intimate talks with Initiates***
by **SARVARI**

Gen. Editor : Dr. VAASILI

First Edition : May 2008

**Price : Rs. 100/-**

Published by
**MASTER YOGAASHRAM**
Plot 89, Krishna Enclave,
Military Dairy Farm Road, Tirumalagiri,
SECUNDERABAD - 500 015.
Phone : (040) 27790094, 27796676, Cell : 9849103322
Email - drvaasili@yahoo.co.in
www. masteryogashram.com

Printed by
**YOGAALAYA**
Plot No. 90, Krishna Enclave,
Tirumalagiri, SECUNDERABAD - 500 015.
Phone : (040) 27796676

# ఇదీ వరస ....


| | | |
|---|---|---|
| 1. | అమరవాణి | 9 |
| 2. | మీకూ నాకూ మధ్య ... (వ్యక్తి గతం) | 11 |
| 3. | ధ్యానం చేసుకుందాం! రా | 21 |
| 4. | సెల్ఫ్ రియలైజేషన్ ... | 27 |
| 5. | నేనే బ్రహ్మమురా! | 33 |
| 6. | ఎవరివో ... నీవెవరివో ...! | 42 |
| 7. | మారదు ఈ లోకము ... | 52 |
| 8. | ఓం తత్సత్ | 60 |
| 9. | మనసూ - శాంతీ | 77 |
| 10. | దంతవేదాంతం | 83 |
| 11. | మనిషి - మనసు - ఆత్మ | 93 |
| 12. | జ్ఞాన సోపానాలు | 105 |
| 13. | వ్యక్తం - అవ్యక్తం | 112 |
| 14. | సత్యదర్శనం | 117 |
| 15. | సగం మంచితనం | 127 |
| 16. | జ్ఞాన విచక్షణ | 136 |
| 17. | సుఖసారం సంసారం | 145 |
| 18. | సత్సాంగత్యం | 150 |
| 19. | నా లోని 'నేను' | 158 |
| 20. | సత్యానికి ఏది దారి? | 168 |
| 21. | దృశ్యం - దర్శనం | 173 |
| 22. | ఓం శాంతిః | 179 |
| 23. | సాగర సంగమం | 183 |
| 24. | నిజ గురు దర్శనం | 197 |
| 25. | కువకువలు | 206 |

# నిజగురు దర్శనమ్

**డాక్టర్ వాసిలి వసంతకుమార్**

ఎడిటర్

**"ప్రణత నిజజనాన్ స్వాత్మ తుల్యాన్ కరోతి"** అని మాస్టర్ గారు అభయమిచ్చినట్లుగా ఒక నాడీగ్రంథం చెబుతోంది. ఒక గురువు తన శిష్యుడ్ని తనంతటివాడిని చేస్తాననటం ఇంతకుముందు వినని విషయమేం కాదు. అసలు శిష్యుడు తనంతవాడు కావాలనుకోవటంలోనే గురువు ఔన్నత్యం బయటపడుతుంది. ఇప్పటి వరకు 'అలా అనుకున్న గురువులు – అయిన శిష్యులు' ఎంతమంది ఉన్నారో మన ఊహకు అందదు.

మాస్టర్ గారి విషయంలో 'నిజ జనాన్' ఎవరు? మాస్టర్ గారి యోగాన్ని అనుసరించి సాధన చేస్తున్నవారందరూ సాధకులే! కాదనం. అయితే అందరు సాధకులూ నిజజను లవుతారా అని. ఈ 'నిజజన' అనే పదానికి అర్థం వేరే ఉండి ఉంటుంది. "చెప్పినట్లు ... సక్రమ పద్ధతిలో ..." అని మాస్టర్‌గారు ఒక సందర్భంలో అంటారు. అంటే అలా సాధన చేసేవారే నిజజనాలని అర్థమా! అలా 'మాస్టర్ డిసిప్లిన్' తో సాధన సాగిస్తే 'నిజజనం'గా మనలో ఎంతమందిమి మిగులుతాం?! పోనీ 'నిజం'గా మన 'నిజం' మనకి తెలుసు కాబట్టి గురువుకైనా ఆ నిజం వర్తించాలి కదా! అంటే 'నిజజనం'లా 'నిజ గురువు'లా ఉండాలి. శిష్యులకి రాయితీల్లేనట్లే గురువులకీ ఉండవు కదా! ఆ 'నిజగురువు' ఎలా దొరుకుతాడు?

మొన్నీమధ్యనే ఒకాయన మన యోగాశ్రమానికి వచ్చాడు. ఎందు కొచ్చారంటే 'గురువుగార్ని దర్శించుకుపోదామ'ని జవాబు. ప్రతీ వారం ఇలా ఇద్దరు ముగ్గురయినా తారసపడుతుంటారు. ఈ దర్శించుకోవటమేమిటో నాకింకా అర్థం కాదు. దేవాలయానికి వెళ్లి భగవద్దర్శనం అయిందని తృప్తి పడినట్లు యోగాశ్రమానికి వెళ్లి గురుదర్శనం చేసుకుంటే ఒరిగేదేమిటి? ఆలయ దర్శనమూ, గురుదర్శనమూ ఒకటే అవుతాయా?! రెండూ ఒకటే అయితే కనక నాకీ దర్శన భాగ్యాలు కలగకపోవటమే మంచిదనిపిస్తుంది.

నావరకు నేను త్రికరణయోగిని ... అంటే మనసా, వాచా, కర్మణా! అలాగే మన యోగమిత్రులంతా ఉండాలని కోరుకుంటాను. నాకు తల్లీ, తండ్రీ, గురువూ ప్రాతఃస్మరణీయులు. సద్గురువు, మహా గురువు, పరమ గురువు నిత్యస్మరణీయులు. ఆత్మ గురువే ఉచ్ఛ్వాసం, నిశ్వాసం. అదే నా యోగలయ. అనుకోకుండా వచ్చానో లేక సంకల్పబలంతో వచ్చానో ఇప్పటికయితే నాకు తెలీదు కాని, ఈ ప్రపంచంలోకి వచ్చాను కనుక, ఇష్టపూర్వకంగా నిష్క్రమించాలంటే తల్లిదండ్రుల నుండి పరమగురువుల దాకా చేయూత అవసరం. నవమాసాలు మోసిన తల్లి, నవగ్రహాలను శాసించగల ఆత్మ లేకపోతే ఈ పాంచభౌతిక ప్రయాణం ఎటువైపు! ఒక మహాగురువు 'సత్య' బాటలో సాధన సాగిస్తే 'ఆత్మ' గురువుగా పరిణమిస్తుంది. అదే 'పరమ' గురువుగా ప్రకాశిస్తుంది.

మనసా, వాచా, కర్మణా మనం యోగ–ధ్యాన పద్ధతులకు సిద్ధం అయి సాధన కొనసాగిస్తే – క్రమంగా ప్రాపంచిక ప్రలోభాలకు దూరం కాగలుగుతాం, వైయక్తిక సుఖలాలస వైపు మనసు మొగ్గు చూపదు, ప్రపంచానికి దూరమవుతూ మనకి మనం దగ్గరవుతాం, చైతన్యవంతులమై అనంత శక్తిని ఆస్వాదిస్తాం, మనం అంతర్ధానం అయి అరూపంగా అభావంగా మిగులుతాం, ఆత్మశక్తి పరాశక్తుల అనుసంధానం అనుభూతిస్తాం, జీవాత్మ పరమాత్మల మమేకత్వంతో విశ్వాంతరాళంలో అంతర్భాగం అవుతాం – ఇవన్నీ సాధనలో అధిరోహించే మెట్లు – ఇదంతా యోగక్రియ – ఇదంతా ఆత్మపథం – ఈ ఆత్మపథంలో ఒక ఉన్నత శిఖరం – ఆ శిఖరాగ్రం నుండి పరమ గురువు నిర్నిమేషంగా నిన్నే చూస్తుంటాడు – అది పరమ గురువు ఆహ్వానం ... ఆ

శిఖరానికి చేరుకోగలిగితే అంతటా కాంతి ... అంతా శూన్యం ... భూత భవిష్య వర్తమానాలకి అక్కడ ఉనికి లేదు ... మిగిలింది ఆత్మ ... ఒంటరిగా! అదీ గురుదర్శనం!

అంటే ఉపదేశించిన గురువు సద్గురువుగా, మహా గురువుగా మన సాధనలో పరిణమించాలి. అంటే, 'పరమ గురువు'గా ప్రపంచం గుర్తించినా మనం గురువుగా భావించి సాధన ప్రారంభిస్తే మన సాధనా బలాన్ని బట్టి ఆ గురువే క్రమంగా సద్గురువుగా, మహా గురువుగా పరిణమిస్తూ పరమ గురువు స్థాయికి చేరుకుంటాడు. మన సాధనకి, అనుభూతికి, అనుభవానికి అందివచ్చిన పరమ గురువు పదుగురిలో ఒకడు కాడు ... పరమం, పవిత్రం అవుతాడు. అప్పుడు చెప్పుకోవచ్చు ... మనం 'గురుదర్శనం' అయిందని. భౌతిక గురుదర్శనం కాదు మనకి కావలసింది ... ఆత్మ గురుదర్శనం ... అది విశ్వరూపదర్శనం.

నా వరకు ఈ 'గురుదర్శనం' రచయిత శ్రీ శార్వరి ఎవరు? ఈ 'గురు' 'దర్శనం' ఏమిటి? అని అవలోకించుకుంటే నా దర్శనం ఇదీ –

పూర్వజన్మల్ని మూటకట్టుకు రాలేదనుకుంటే – అనుకుని జన్మించ లేదనుకుంటే – ఏ వాసనలూ లేని కొన్ని కణాలు తల్లి యామినీదేవి గర్భంలో నవమాసాలు 'రూపం' తీసుకుని – తండ్రి శ్రీ శార్వరి ఆత్మనుండి విడివడ్డ జీవం ఆ నవమాసాల రూపంతో మమేకమై – ప్రాణ స్పందనగా పరిణమించి 'వసంతం' గా పుత్ర సంతాన మయ్యాను. అలా తల్లిదండ్రుల సంతాన యోగంలో అగ్ర తాంబూలా న్నందుకున్నాను. రెండు దశాబ్దాల పాటు వారి మనసెరిగి నడుచుకున్నాను. ఆపై ముప్ఫయి సంవత్సరాలుగా వారి ఆత్మలకి చేరువగానే ప్రయాణం సాగిస్తున్నాను.

నాకు తల్లి ఒడి బడి అయింది ... తండ్రి ఒడి గుడి అయింది ... తల్లిదండ్రుల గుడి యోగాలయ మయింది. ఈ శరీరానికి రూపం తల్లి ... జీవం తండ్రి ... ప్రాణం యోగం. కన్న తండ్రే – ఉపదేశ గురువు ... సాధనలో సద్గురువు ... మార్గ నిర్దేశకంలో మహాగురువు ... పరమ పథంలో పరమ గురువు ... వెరసి "ఆత్మయోగి". ఇదీ నా ఆత్మదర్శనం ... నా గురు దర్శనం ... నా యోగదర్శనం. 'నిజం'గానే నాది పుత్ర 'యోగ'మే! 'ఆత్మ' యోగమే!

నేను నాన్నగార్ని 'నాన్న'గా చూడటం మానుకుని చాలా ఏళ్లయింది. నాన్నగారు నా ఆత్మపథంలో 'గురువు'గా, 'సద్గురువు'గా పరిణామం చెంది పరమ గురువు మాస్టర్‌గా ప్రతిష్ఠితమైపోయారు. ఈ పుత్రయోగికి తండ్రీ, గురువు, సద్గురువు, మహా గురువు, పరమ గురువు ... అన్నీ మాస్టర్ శార్వరి. ఈ నా 'గురుదర్శనం' విశ్వరూప సందర్శనం.

మాస్టర్ శార్వరి ఈ 'గురుదర్శనం'లో "లోకం మనలోంచి నిష్క్రమించ డమే యోగం" అంటారు. "మనసుని శుద్ధి చేసి, హృదయాన్ని కడిగి రెంటినీ ఒకే తాటి పైకి తేవాలి. అంటే మనసులోని కల్మషాలు పోవాలి. హృదయంలోని దోషాలు పరిహరించాలి. ఇతరుల్లోని మంచిని మాత్రమే చూడాలి. అందరినీ ప్రేమించ గలగాలి" అంటారు. మీ హృదయం ప్రేమాలయమే అయితే ఈ యోగాలయం మిమ్మల్ని ఎప్పుడూ స్వాగతిస్తూనే ఉంటుంది.

"ఆత్మజ్ఞానం వల్ల ప్రపంచజ్ఞానం ఎంత నిరుపయోగమో తెలుస్తుంది. 'ఆత్మ' స్పృహ వల్ల 'ప్రపంచ' స్మృతి పోతుంది. మనం వేరు, మన లోకం వేరు. ఈ ప్రపంచం మనది కాదు. అనే స్థిరనమ్మకం కలుగుతుంది" అంటారు శ్రీ శార్వరి. ఆ నమ్మకం ఉంటే మీకూ మాస్టర్ యోగాశ్రమం ఆశ్రయ మిస్తుంది.

ఈ 'గురుదర్శనం' అంతా Intimate talks with Initiates కదా! ఒక ఇంటిమేట్ టాక్ – "మీ తర్వాత మీ యోగా ఇంపాక్టు మీ శిష్యులపైన గాని, మీ యోగాశ్రమంలో గాని ఉంటుందా? మీతోనే ఉంటుందా?" అని ప్రశ్న. దానికి మాస్టర్ శార్వరి సమాధానం – "రమణాశ్రమం, అరవిందాశ్రమం, షిర్డీ ఎప్పుడైనా చూచారా? ఆ ముగ్గురు మహర్షుల ప్రభావం ఉందా? పోయిందా? అసలు పోవటం అంటే చనిపోవడమే గదా! శరీరం లేకుండా పోవడం. శరీరం రూపం పోతుంది. ఆత్మ మిగిలి ఉంటుంది. పైన చెప్పిన వారి ఆత్మశరీరాలు ఉన్నాయి. వారి యోగశక్తీ ఉంది. ఇంకా పెరిగిందని చెప్పవచ్చు."

Yes, We live High !

We Let our mediums enlighten high !!

*Master C.V.V. Namaskaram*

# గురు దర్శనం

***[Intimate talks with Initiates]***

## 1. అమరవాణి

*సుస్వాగతం!*

*అలౌకిక దివ్య సందేశాన్ని అందుకుని సమావేశమైన మీకు ఆశీస్సులు!*

*గురు పరంపర హృదయాన్ని గుర్తించి, స్పందించిన జిజ్ఞాసులకు,*
*యోగ సాధకులకు సమారోహం ఆహ్వానం పలుకుతోంది.*

*పిలవకపోయినా, మా గుండెల చప్పుడు విని,*
*మనో వేగంతో వచ్చిన 'ఆత్మ' బంధువులకు ఆత్మీయ స్వాగతం.*

*ఈ సమావేశం అపూర్వం. యోగ జిజ్ఞాసుల సందేహాలకు మా ప్రతినిధి ఒకరు సమాధానం యిస్తారు. అతనికి పరమ గురువుల ప్రజ్ఞ అందుబాటులో ఉంటుంది.*

*మీరు యధేచ్ఛగా ప్రశ్నించవచ్చు.*

*అందరం మనసు విప్పి మాట్లాడుకుందాం.*

*మనసు చెప్పని భావాలనూ కలబోసుకుందాం.*

*గురువుల్ని ప్రశ్నించే హక్కు ప్రతి శిష్యునికీ ఉంది.*

*శిష్యుల సందేహాలకు సమాధానాలు చెప్పవలసిన అవసరం ప్రతి గురువుకూ ఉంటుంది.*

*ఇంక ప్రతి ఒక్కరు తమ ప్రశ్నలను సంధించవచ్చు.*

★ ★ ★

**తొలి ప్రశ్న :**

***ఓ మహాత్మా! ఒక సందేహం!***

***అమాయకంగానో, అజ్ఞానంతోనో అడుగుతున్నది కాదు. అవసరం.***

***గురువు – సద్గురువు – మహాగురువు – పరమ గురువు.***

***ఈ నలుగురి మధ్య తేడా ఏమిటి?***

**మహాత్మ సమాధానం :**

భౌతిక శరీరంలో ఉండి మీకు మొదట యోగోపదేశం చేసేది గురువు. చివరన జ్ఞాన సీమలకు చేర్చేది సద్గురువు.

సూక్ష్మ శరీరాలతో ఉండి ఆధ్యాత్మిక రంగంలో సాధకులను పర్యవేక్షించేది మహాగురువులు. వారు మృత్యుంజయులు. పరమ గురువులు బ్రహ్మాసిద్ధిని పొందినవారు. వారు పరబ్రహ్మతో సములు. వారు విశ్వఋషులు.

భూలోకం, భువర్లోకం, సువర్లోకం – అనే మూడు లోకాలలో సంచారం చేయగలవారు, అవసరమైపుడు దివ్యదర్శనం యివ్వగలవారు పరమ గురువులు.

★ ★ ★

**పరిప్రశ్న :** ***గురువు అయిన ప్రతి ఒక్కరు సద్గురువు కాగలడా?***
***గురువులందరూ ఎప్పటికైనా పరమ గురువులు అవుతారా?***

**మహాత్మ :** కోటిమందిలో ఆధ్యాత్మికత వైపు దృష్టి పెట్టే వారు వేయి మంది ఉండరు. వేయి మందిలో సాధన, జిజ్ఞాస కలవారు పదిమంది ఉంటారు. వేయి మంది సాధకుల్లో గురువు కాగల వ్యక్తి ఒకరుంటారు. నూరుగురు గురువుల్లో సద్గురువు అయ్యే ప్రజ్ఞ ఒకరికి ఉండవచ్చు. నూరు మంది సద్గురువులలో మహా గురువులయ్యే వారు పదిమంది మిగులుతారు. పదిమంది మహా గురువుల్లో పరమపద సోపానాలు అధిరోహించి, పరమ గురువు అయ్యేవారు ఒక్కరుంటారు. అలాంటి వారే మాస్టర్లు.

★ ★ ★

**చిరు ప్రశ్న :** ***మాస్టర్ సి.వి.వి. గారు పరమ గురుశ్రేణిలోని వారా?***
***ఎలా చెప్పగలరు?***

**మహాత్మ :** నిదర్శనాలు అవసరం లేదు. మాస్టర్ సి.వి.వి. నిక్కచ్చిగా పరమ గురువు. పరమ యోగి – పరబ్రహ్మాంశ మూర్తీభవించినవారు. అది మా విశ్వాసం – నమ్మకం.



## 2. మీకూ నాకూ మధ్య ...

### (వ్యక్తి గతం)

***ప్రశ్న : గురూజీ! నలభై సంవత్సరాలుగా యోగం చేస్తూ, యోగాశ్రమం నిర్వహిస్తూ, వేల మందికి యోగం రుచి చూపించిన మీ వ్యక్తిగత అనుభవాలు తెలుసుకోవాలని ఉంది. మీరు అనుమతిస్తే కొన్ని ప్రశ్నలు -***

జవాబు : యోగం నలభై సంవత్సరాలుగా చేస్తున్నట్లు కనిపిస్తోంది - ఈ జన్మ ఖాతాలో. ఇంతకు ముందు నాలుగు జన్మలలో ఎంత యోగం చేసి ఉంటానో మీకు తెలియదు. ఈ జన్మలో మనం చేసే కొన్ని మంచి పనులకు పునాదులు పూర్వజన్మలలో ఉంటాయి! కనుక నలభై సంవత్సరాల సాధన అనకూడదు. సాధనను కాలంతో కొలవకూడదు. ఎనభై సంవత్సరాల జీవితంలో నలభై సంవత్సరాల కాలం యోగానికి పూర్తిగా అంకితం చేయగలిగాను. అదీ నాకు మిగిలిన తృప్తి.

***ప్రశ్న : మీ సుదీర్ఘ జీవన యాత్రలో నలభై సంవత్సరాల యోగం తక్కువేమీ కాదు. మీరు సాధించిన విజయాలు అంతంత మాత్రం కావు. ఆనాటికీ - నేటికీ చెప్పుకోదగ్గ మార్పు?***

జవాబు : మార్పు మానవ సహజం. పరిణామం ఎప్పుడూ ఉంటుంది. లోకం మారుతోంది. లోకంతో పాటు మనిషి ఆలోచనా విధానం మారుతోంది. అన్ని రంగాలలో వలె ఆధ్యాత్మిక రంగంలోనూ విప్లవాత్మక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రతి మనిషిలో రవ్వంత తాత్వికత చోటు చేసుకుంది. దీనిని విప్లవాత్మకం అనకపోయినా 'ఆధ్యాత్మిక వికాసం' అనవచ్చు. ఈ మార్పు మంచికే అనిపిస్తోంది.

*ప్రశ్న : పాతికేళ్ల క్రితం ‘మాస్టర్ యోగాశ్రమం’ ప్రారంభించారని విన్నాం. మీకు ఆ సంకల్పం ఎలా కలిగింది! ప్రేరణ ఏమైనా ...?*

జవాబు : ‘ప్రేరణ’కు కారణాలు ఉండవు. ‘ప్రేరణ’ అంటేనే అంతరాత్మ ప్రబోధం అని. అసంకల్పిత సంకల్పం. రూపాయిన్నర పెట్టుబడితో ప్లాస్టిక్ అక్షరాలతో ‘నేమ్ ప్లేట్’ రాయించి మా గుమ్మం పక్కన బిగించాను. లోపలి గదిలో గుమ్మంపైన మాస్టర్ గారి ఫొటో పెట్టాను. ఆ పని జరిగిన నాలుగు రోజులకే ఒక సంఘటన జరిగింది విచిత్రంగా –

ఒక అమ్మాయి ఆటోలో పోతూ పోతూ ఆ బోర్డు చూచింది. ఆమె చూపులు లోపల గోడపై నున్న మాస్టర్ గారి ఫొటోపైన పడ్డాయి. ముందుకు వెళ్లిన ఆటో నిమిషంలో వెనక్కి వచ్చి గుమ్మంలో ఆగింది. ఆ అమ్మాయి లోపలికి వచ్చి తనను పరిచయం చేసుకుంది.

ఆమెది నాగపూరు. మాస్టర్ గారి మనవరాలు. ఫోటో చూచి ఎంతో ఆనందించింది. ఆమె కళ్ల వెంట నీళ్లు కారాయి. తాను మళ్లీ వస్తానని ‘మాస్టర్ యోగం’లో ఇనీసియేషన్ కావాలని అడిగింది. ఆమె ‘రాక’ ప్రేరణ. అదే మాస్టర్ గారి ఆమోదంగా, ఆశీస్సుగా భావించాను. యోగాసెంటర్ ప్రారంభించమని ప్రోత్సహించి వెన్ను తట్టిన సీనియర్ మీడియమ్స్ ఓ డజను మంది వరకు ఉన్నారు. వారిలో శ్రీ డి.ఎన్. రావు ప్రాతఃస్మరణీయుడు. ఆయన అండదండలు లేనిదే మాస్టర్ యోగాశ్రమం ఈ స్థితికి వచ్చేది కాదు.

*ప్రశ్న : అప్పటికి, ఇప్పటికి మీలో వచ్చిన మార్పు?*

జవాబు : అప్పుడు ఒక ఉద్యోగం ఉంది. ఇప్పుడు లేదు. అప్పుడు చాయ్ చారణా. ఇప్పుడు అయిదు రూపాయలు. అప్పుడు హోటల్ భోజనం రూపాయి. ఇప్పుడు కనీసం పాతిక రూపాయలు. జీవన వ్యయం నూరు రెట్లు పెరిగింది. అదే మార్పు. నాలో మార్పు అంటారా? అప్పటికీ ఇప్పటికీ ‘కలం’ జీవిని. అక్షరాలే నా జీవనాధారం.

*ప్రశ్న : గురూజీ! మీరు దేవుళ్లను నమ్మరు. అవతారపురుషులను నమ్మరు. దేవాలయాలకు వెళ్లరు. పోనీ భగవంతుని నమ్ముతారా? మాస్టర్ గారు ‘పరబ్రహ్మాంశ’ అన్నది ఎలా నమ్ముతారు?*

జవాబు : భగవంతుడ్ని నమ్ముతాను – ఒక రూపంగా కాదు – విశ్వశక్తిగా, చైతన్యంగా. ‘బ్రహ్మం’ అంటే విశ్వం అంతా నిండిన చైతన్యం అని. అవతార

పురుషులు ఏదో ఒకదేవుని అవతారాలంటారు. దేవతలు మనలాంటివారే. మరో లోకంలో ఉంటారు? ప్రశ్న చిన్నదే గానీ దానిలో చాలా ముడులున్నాయి. అన్నీ చిక్కుముడులు.

చూడు మిత్రమా! మీరు నన్ను 'గురూజీ' అంటున్నారు. నేను మిమ్మల్ని 'మిత్రమా' అంటున్నాను. గురుశిష్యులు 'ఆత్మ' మిత్రులు. శిష్యుడు గురువును ఆత్మ బంధువుగా చూడాలి. మొదటి పాయింట్ : నేను ఎవరికీ గురువును కాను. మన యోగంలో గురుశిష్య సంప్రదాయం లేదు. ఏదో అలవాటుగానో, అలవోకగానో మీరు 'గురువుగారు' అంటారు. అది గౌరవ వాచకంగా నేను భావిస్తాను. అంతకంటే విశేషం లేదు. యోగంలో అందరూ స్వతంత్రులే. అందరూ బాటసారులే. మాస్టర్ యోగంలో ఎవరు ఎవరినీ 'గురువు' అననవసరం లేదు.

నేను దేవుళ్లను నమ్మననడం అభాండం. విగ్రహాలలో దేవుళ్లను నమ్మను. శక్తిని నమ్ముతాను, ఆరాధిస్తాను. గుళ్లోకి వెళ్లి విగ్రహం ఎదురుగా నిలబడి, కళ్లు మూసుకుని నమస్కరించను. ఎక్కడ ఉన్నా దైవశక్తిని ఆరాధించవచ్చు. దేవాలయానికే వెళ్లనవసరం ఏమిటి! చెట్టు క్రింద ధ్యానం చేసినా భగవంతుడు కాదనడు. యోగం చేసే వారికి దేవుళ్లతో పని ఉండదు. మనస్సు దాటినవాడు యోగి, మనసు పరిధిలోని బందీలు దేవుళ్లు.

నా కాన్సెప్ట్ వేరు. మాస్టర్ గారు తను 'పరబ్రహ్మాంశ' అని ఎప్పుడైనా చెప్పారా? లేదు. నాడీ జ్యోతిష్యాలు చెప్పిన మాటలు అవి. 'మాస్టర్' అంటే మహాయోగి. పరమ గురువుల్ని 'మాస్టర్స్' అంటారు దివ్యజ్ఞాన సమాజం వారు. 'మాస్టర్స్ కాన్సెప్ట్' వారిది. మాస్టరు గారు థియోసఫీకి చెందిన వారు. పరమ గురువులే 'మాస్టర్' సివివి గారిని తమ ప్రతినిధిగా ఆమోదించారు. మన విశ్వాసంతో పనిలేదు. సివివి గారు చాలా జన్మలు దాటివచ్చి పూర్ణయోగి అయినారు. ఈ జన్మలోనే పరమ గురువుల ఆమోద ముద్ర, గుర్తింపు లభించింది.

*ప్రశ్న : మాస్టరు గారి యోగానికి మీరందిస్తున్న సహకారం చాలా ప్రశంసనీయం!*

జవాబు : ఎవరి ప్రశంసల కోసం నేను యోగం చేయడం లేదండీ! ఎవరి కితాబులు నాకు అవసరం లేదు. ఈ పని నాచేత మాస్టర్లు చేయిస్తున్నారు ... చేస్తున్నాను అంతే. అది నా డ్యూటీ. అది నాకు వారు నిర్దేశించిన పని. నా

గొప్పతనం ఏమీ లేదు. నేను కాకుంటే మరొకరు ఈ పని చేసేవారు? చేయిస్తున్నది మాస్టర్లు, నేను నిమిత్తమాత్రుడిని. నేనేదో 'మహా' చేశానని మీరు అభిమానంతో అన్నా, అంగీకరించడం నా అవివేకం, అజ్ఞానం అవుతుంది.

*ప్రశ్న : మీ రచనలు యోగానికి ఎంతగానో సహకరిస్తున్నాయి. కాదంటారా?*

జవాబు : యోగానికి నా రచనలు సహకరించడం ఏమిటి? యోగమే నా రచనలకు సహకరిస్తోంది. నాకు రచనే యోగం. రచన కోసం యోగం చేస్తున్నానో, యోగం కోసం రచన చేస్తున్నానో తెలియనంత ఐక్యతారాగం మా మధ్య. నన్ను బ్రతికిస్తున్నది యోగం. నేను జీవిస్తున్నది యోగం కోసం. యోగబలం లేకుంటే ఒక్క అక్షరం రాయగలిగే వాడిని కాను. కనుక నేను యోగానికి రుణపడి ఉంటాను.

నాలాగా రచనల్ని యోగంతో ఆశ్వాసించిన వారు తక్కువ. అరవిందయోగి కవి, యోగి – రచనా యోగి. రచనల్లో జీవించిన పూర్ణయోగి. నేను అరవిందుని అనుసరించలేదు కాని స్ఫూర్తి అదే. యోగ సాధనా ఫలాలను రచనల్లో నిక్షిప్తం చేయడం కూడా యోగం కావచ్చు. అందుకే నా రచనల్లో నేను కనిపించను. నా పాత్ర ఉండదు. నా ప్రమేయం ఉండదు. నా ధ్యానం ఉంటుంది. నా పుస్తకాల్లో నా యోగం ప్రతిఫలిస్తుంది.

ఎవరికీ తెలియదు! నేను ఏదో రాయాలని ప్లాను వేసుకోను. ఫలానా విషయం పైన రాయాలన్న ఆలోచన ఉండదు. ఎప్పుడో యోగంలో ప్రవేశించిన తొలినాళ్లలోనే నా బుర్ర ఖాళీ అయింది. ఒక్క ఆలోచన రాదు. అంతా శూన్యం. శూన్యం కావడం యోగ లక్షణం కావచ్చు గానీ అది రచయితకు 'శాపం' అవుతుంది. మేధావికి శూన్యం నరకం చూపిస్తుంది. ఆ శూన్యంలోంచి కొత్త 'ప్రతిభ' పైకి వస్తుందనుకుంటా! ధ్యానంలోనో, స్వప్నంలోనో ఒక మెరుపు మెరుస్తుంది. ఒక సంకల్పం ఏర్పడి స్థిరపడుతుంది. ఏరోజు కారోజు ధ్యానంలోనో, బ్రాహ్మీ ముహూర్తంలోనో మరి కొన్ని వెలుగులు మదిలో మెదులుతాయి. ఇంక కాగితం మీద పెట్టకుండా ఉండలేని పరిస్థితిలో రచనకు ఉపక్రమిస్తుంటాను. నాది ఒక రకంగా మిస్టిక్ రచన. నా ప్రమేయం లేకుండా నా మనసు జోక్యం లేకుండా సాగుతుంది రచన. అంతా అయి ప్రూఫులు దిద్దుకునే సమయంలో చదివితే ఆశ్చర్యం వేస్తుంది ... ఇది రాసింది నేనేనా? అని. అసంభవం! ఇది నా రచన కాదు! నా కంత తెలివితేటలు లేవని నాకు తెలుసు! భావాలు, శైలీ అన్నీ కొత్తగా అనిపిస్తాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Guru+Darsanam**

* * *